RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 47 పేజీలు - 08 బుధవారం 14 జనవరి 2026

## దుబ్బాకలో కాంగ్రెస్ జోష్

- మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం: వివేక్



తొలి అక్షరం/సిద్దిపేట,జనవరి 13: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గతంకంటే దుబ్బాకలో కాంగ్రెస్ జోష్ కనిపిస్తోంది. ఆ ప్రాంతంలో మెజార్టీ సర్పంచులను కాంగ్రెస్ గెలుచుకుంది.. అదే జోష్ లో మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధించి దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. కాంగ్రెస్ దుబ్బాకలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.15 కోట్లతో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా మన్నారు. మున్సిపాలిటీలకు రూ. 50లక్షల చొప్పు న నిధులు కేటాయించామన్నారు. ఆరు గ్యారంటీలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు మంత్రి వివేక్. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తు న్నాం.. అర్హత కలిగి ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూ రు చేశామన్నా రు. రైతులకు 2లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్నారు. రుణమాఫీ కాని వారు ఎవరైనా ఉంటే వారి పేర్లు ఇస్తే రుణమాఫీ చేయిస్తానని హామి ఇచ్చారు.



## ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

**సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకున్న కొత్త ఆఫీస్**

**సేవాతీర్థ్‌లోకి త్వరలోనే మారనున్న మోడీ**


తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 13 : ఢిల్లీలో ప్రతిష్టాత్మక సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధానమంత్రి కొత్త కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. రైసినా హిల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవన సముదాయంలోకి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు మిగతా2లో...

## కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

- బిఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యతు లేదు...రాదు
- కెసిఆర్ కుటుంబ అవినీతిపై కవిత వ్యాఖ్యలే నిదర్శనం
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 13: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నా రంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, మిగతా2లో...



## గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

**పథకాలతో సహా అన్నిటికి ఇంది, రాజీవ్ పేర్లేనా**

**వాల్మీకి-అంబేడ్కర్ పేరున్న పథకం పేరు ఎందుకు మార్చారు**

**కాంగ్రెస్ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**

**కరీంనగర్ మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరేస్తాం**

**కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**

తొలి అక్షరం/కరీంనగర్,జనవరి 13: ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాన్ని నీచ రాజకీయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. వాల్మీకీ-అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పేరుతో వాజ్‌పేయి తీసుకొచ్చిన ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. వాల్మీకీ, అంబేద్కర్ పేర్లు తొలగించి ఇందిరా ఆవాస్ యోజనగా ఎందుకు మార్చారని, ఇది ఆ మహానుభావులను అవమానించడం కాదా అని విమర్శించారు. మిగతా2లో...




## ఇరాన్ ఆందోళనల్లో భారీగా మరణాలు

**వేలల్లో ఉంటుందన్న వార్తలతో ఆందోళన**

తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 13 : ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు ఆందోళన కలుగుతోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపోయినట్లు అధికారిక సమాచారం రాగా.. మిగతా2లో...

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

- ఒక్క కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే
- అందుకు విధించే జరిమానాలకు సిద్ధంగా ఉండండి
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే
- ఘాటు హెచ్చరిక చేసిన సుప్రీం కోర్టు



తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 13 : వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరో సారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవ హారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ మిగతా2లో...

## కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

● రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు ● సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ ● మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క



తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 13 : 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గతంకన్నా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దనసరి అనసూయలు అన్నారు. మేడారం జాతరపై డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మిగతా2లో...




## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా ప్రకటన

**మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు**

**26,80,014 మంది మహిళా ఓటర్లతో వారిదే అగ్రస్థానం**

**నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు**

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

**70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 13 : ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు సృష్టించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు నెలకొల్పిందని అన్నారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని అన్నారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని స్పష్టం చేశారు. మిగతా2లో...

## ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

- ఆపరేషన్ సిందూర్‌లో భూతల దాడులకు కూడా సిద్ధపడ్డాం
- భద్రతా సవాళ్లను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత
- షక్సాగామ్ వ్యాలీ ఎప్పటికీ భారత్‌లో భాగమే
- మీడియా సమావేశంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 13 : ఉగ్రవాదులు తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతామని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమ న్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ..భద్రతా సవాళ్ల ను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత దీని ద్వారా స్పష్టమై ందని పేర్కొ న్నారు. ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంట ల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయి. ఉగ్ర మిగతా2లో...

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

(మొదటి పేజీ తరువాయి)

కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు.

డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు.

శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించాయి. నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్' గా పిలిచిన ఈ సముదాయానికి కేంద్ర ప్రభుత్వం 'సేవా తీర్థ్' అని నామకరణం చేసింది. ఈ ప్రాంగణంలో మొత్తం మూడు మెయిన్ బిల్డింగులు ఉన్నాయి. ఒకదాంట్లో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) ఉంటుంది. రెండో భవనం నుంచి కేబినెట్ సెక్రటేరియెట్ విధులు సాగుతాయి. మూడో భవనంలో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)తో పాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ కార్యాలయం ఉంటుంది. కొత్త కార్యాలయంలో విదేశీ ప్రముఖులు, అతిథులతో సమావేశమయ్యేందుకు వీలుగా హై-ఎండ్ రూమ్‌లను రూపొందించారు. ఇవి అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటమే కాకుండా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయి. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల కోసం ఒక హాలును సిద్ధం చేశారు. అధికారుల మధ్య సమన్వయం పెంచేందుకు 'ఓపెన్ ఫ్లోర్' మోడల్‌ను ఇక్కడ అమలుచేస్తున్నారు. కాగా.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి కార్యాలయం సౌత్ బ్లాక్ నుంచే పనిచేస్తున్నది. తాజా మార్పుతో దశాబ్దాల చరిత్రకు తెరపడనుంది. నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న హోం, ఫైనాన్స్, విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖలు ఇప్పటికే కొత్తగా నిర్మించిన 'కర్తవ్య భవన్' కు తరలివెళ్లాయి. ఖాళీ అయిన ఈ పురాతన కట్టడాలను భారీ మ్యూజియంగా మార్చనున్నారు. సేవా తీర్థ్ సమీపంలోనే ప్రధాని కొత్త నివాసం కూడా నిర్మాణం అవుతున్నది. ప్రస్తుతం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసాన్ని కూడా అక్కడికే మార్చనున్నారు.

# కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు,అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సబ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026 లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్క?సారలమ్మ జాతరను కుంభ మేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. ఈసారి జాతరకు దాదాపు మూడు కోట్ల మంది హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. తదితర ప్రారంభానికి ముందే దాదాపు 30 శాతం భక్తులు సందర్శిస్తారని అన్నారు. జాతర సమయంలో 60 శాతం నుండి 65 శాతం వరకు, జాతర అనంతరం 5 శాతం భక్తులు మేడారం సందర్శిస్తారని వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్, సి.ఎస్ రామకృష్ణరావులు ఆవిష్కారించారు.

# ఇరాన్ ఆందోళనల్లో భారీగా మరణాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సంఖ్య రెండు వేల వరకు ఉండొచ్చని ఇరాన్ అధికారులు సంకేతాలిచ్చారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో ఇరాన్ అధికారులు వెల్లడించారు. అక్కడ పెరుగుతోన్న హింస చాలా భయపెడుతోందని ఐరాస మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన వెబ్‌సైట్ మాత్రం ఇటీవల ఆందోళనల్లో పది వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సంచలన కథనంలో పేర్కొంది. ఈ మరణాల వెనక ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. మరోవైపు ఇటీవల ఘర్షణల్లో 12 వేల మంది చనిపోయినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' కథనం పేర్కొంది. భద్రతా సంస్థలు, అధ్యక్ష కార్యాలయం, ప్రత్యక్ష సాక్షులు, వైద్యాధికారులు.. తదితర వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు తెలిపింది. జనవరి 8, 9 తేదీల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయని, ఓ ప్రణాళిక ప్రకారమే ఈ హింసాత్మక ఘటనలు జరిగాయని వెల్లడించింది. ఆధునిక ఇరాన్ చరిత్రలో ఈ తరహా హింస ఎన్నడూ చోటుచేసుకోలేదని పేర్కొంది. దేశవ్యాప్తంగా 31 ప్రావిన్సుల్లో 600లకుపైగా ప్రదేశాల్లో నిరసనలు కొనసాగినట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. వందలాది మంది మృతి చెందగా, 10వేలకు పైగా నిరసనకారులను అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. అయితే, ఈ భయంకరమైన హింసాత్మక ఘటనలు ఇలాగే కొనసాగితే చాలా కష్టమని.. ఇరాన్ పౌరుల న్యాయమైన డిమాండ్లను తప్పక వినాల్సిందేనని ఐరాస మానవ హక్కుల హైకమిషన్ పేర్కొంది. మరణాలు వందల సంఖ్యలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని ఆ సంస్థ అధికార ప్రతినిధి జెరెమీ లారెన్స్ పేర్కొన్నారు. అంతేకాదు.. అరెస్టైన వారిలో అనేక మందికి మరణశిక్ష పడవచ్చునే ఆందోళన వ్యక్తం చేశారు.

# వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

(మొదటి పేజీ తరువాయి)

ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

(మొదటి పేజీ తరువాయి)

శిబిరాలను నేలమట్టం చేయగలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నా.. ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు. ఇక వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. ఈ వివాదం పై స్పందించారు. 'షక్సాగామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా-పాక్ ఆర్థిక కారిడార్ విషయానికొస్తే.. అది ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'పాకిస్థాన్-చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే అని స్పష్టం చేసింది. దీనిపై చైనా స్పందిస్తూ.. భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. షక్సాగామ్ వ్యాలీ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్ర్యం రాగానే పాకిస్థాన్ దీన్ని ఆక్రమించుకుంది. అనంతరం దీనికి చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరొక దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఈ వ్యాలీని బీజింగ్‌కు అప్పగించడం ద్వారా పాకిస్థాన్‌తో చైనాకు రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవాను బీజింగ్ నిర్మిస్తోంది.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా ప్రకటన

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 13:**తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.

# గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే గతంలో ఎన్టీఆర్ టెర్మినల్‌గా ఉన్న హైదరాబాద్ విమానాశ్రయ టెర్మినల్ పేరును తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ఎందుకు మార్చారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన.. గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ నేతలు పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దేశంలో అనేక పథకాలు కేంద్ర,రాష్ట్ర భాగస్వామ్యంతోనే నడుస్తున్నాయని, ఈ పథకానికి రాష్ట్ర భాగస్వామ్యం కల్పిస్తే తప్పేముందని నిలదీశారు. ఉపాధి కూలీల వేతనాలను కూడా సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. కరీంనగర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొత్తం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా రూ.40 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఈ నిధులతో కరీంనగర్ రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని అన్నారు. స్మార్ట్ సిటీ, స్వచ్ఛ భారత్, అమృత్ తదితర వివిధ కేంద్ర పథకాల ద్వారానే కరీంనగర్ అభివృద్ధి జరుగుతోందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కరీంనగర్ ప్రజలు గమనిస్తున్నారని అందుకే ఈసారి కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని పార్టీల నేతలు బీజేపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. టిక్కెట్ల కేటాయింపులో కాషాయ కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు ఆయన. అవినీతి ఆరోపణలు లేదా రౌడీషీట్లు ఉన్నవారిని పార్టీలోకి తీసుకోమని తేల్చిచెప్పారు. గతంలో కేసీఆర్ తన ఇష్టానుసారంగా కొడుకు, కూతురు, అల్లుడి కోసం కుటుంబ ఆస్తులు పంచినట్లే జిల్లాల ఏర్పాటు చేశారని ఆరోపించారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి జరుగు తుంటే కాంగ్రెస్‌కు ఎందుకు అక్కసు అని ప్రశ్నించిన బండి సంజయ్, గ్రామాల్లో ఆస్తులు నిర్మించడం తప్పా..? రైతులకు మేలు చేసే పథకం కాదా..? తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు వస్తుంటే వద్దంటారా..? అంటూ నిలదీశారు. వీబీజీ రామ్ జీ పథకం కావాలా..? వద్దా..? కాంగ్రెస్ స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

'వీబీ జీరామ్ జీ' పథకంతో ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు అవుతు ందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'ఈ పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల ఉపాధి దొరుకు తుంది. పనుల విషయంలో కేంద్రం జోక్యం ఉండదు. ఈ పథకం కోసం గతంలో కంటే అదనంగా రూ.17 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తెలంగాణలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వబోతున్నాం. రైతులకు న్యాయం చేసేలా దీన్ని తీసుకొచ్చాం. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవు. దీంతో కూలీలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ చేసుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి వివరించారు. తెలంగాణలో సాధించిన దిగుబడికిగాను రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**• ఉప్పల్ ఎక్స్ రోడ్స్‌లో అరైవ్ అలైవ్ కార్యక్రమం • ముగిసిన అవగాహన సదస్సు.. పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు • నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీసీపీ డి.శ్రీనివాస్**




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి13:** రహదారి నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని ట్రాఫిక్ డీసీపీ-1 డి. శ్రీనివాస్ అన్నారు.మంగళవారం ఉప్పల్ ఎక్స్ రోడ్స్ వేదికగా ఉప్పల్ ట్రాఫిక్,శాంతిభద్రతల విభాగం సంయుక్తంగా అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా వాహనదారులు, పాదచారులకు ట్రాఫిక్ నియమాలు, పౌర క్రమశిక్షణపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. **వాహనదారులు సంయమనం పాటించాలి: డీసీపీ శ్రీనివాస్** కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పది రోజుల 'అరైవ్ అలైవ్'ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు.మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చునే వారు సైతం జాగ్రత్తలు పాటించాలని సూచించారు. **పోలీసులతో ప్రజలు సహకరించాలి: ఏసీపీ చక్రపాణి** శాంతిభద్రతల విభాగం మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.ఉప్పల్ వంటి రద్దీ ప్రాంతాల్లో పాదచారులు నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను 90 శాతం నివారించవచ్చని తెలిపారు.రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ మాత్రమే వాడాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను వినియోగించుకోవాలని సూచించారు. **ప్రజా చైతన్యమే పోలీసుల లక్ష్యం: సీఐ జి. నాగరాజు** ఉప్పల్ ట్రాఫిక్ ఎస్హెచ్ఓ జి. నాగరాజు మాట్లాడుతూ.. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా నిత్యం రద్దీగా ఉండే ఉప్పల్ చౌరస్తాలో ప్రతి వాహనదారునికి చేరేలా ప్రచారం చేస్తున్నామన్నారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఉప్పల్ లా అండ్ ఆర్డర్ ఎస్హెచ్ఓ, వివిధ విభాగాల ఎస్సైలు,తహసీల్దార్,ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మెడికల్ ఆఫీసర్,సుమారు 150 మంది పౌరులు పాల్గొన్నారు. చివరగా రోడ్డు భద్రతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

## సేవా తరుణి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 13:** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి క్లబ్ అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలోమంగళవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొర్రూరు బీరప్ప నగర్ లోని బీరప్ప గుడి వద్ద సంక్రాంతి ముగ్గులు వేసి రంగులతో అలంకరించి భోగి మంటలు వేసి, పొంగలి చేసి తెల్లవారుజామున 5 గంటల నుండి ఆటపాటలతో తెలుగింటి ఆడపడుచులందరూ ఎంతో సరదాగా ముందస్తుగా భోగి వేడుకలను ఆడుతూ పాడుతూ ఘనంగా జరుపుకున్నారు.అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ లయన్ డాక్టర్ ఎస్. నాగవాణి,లయన్ రేణుక రెడ్డి,లయన్ స్వాతి,లయన్ రజిని, లయన్ విజయ మరియు బీరప్ప నగర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి



**తొలి అక్షరం/ఏన్కూర్ జనవరి 14:** ఏన్కూర్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం వరపర్ల రవి అధ్యక్షతన సిఐటియు ఆఫీస్ ఏన్కూర్ నందు జరిగింది ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇటికాల లెనిన్ పాల్గొని మాట్లాడారు ఈ దేశంలో ఉపాధి హామీ చట్టం ఆనాడు యూపీఏ వన్ ప్రభుత్వం వామపక్షాల మద్దతు ప్రవేశపెట్టిందని దానికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అని పేరు పెట్టిందని దానిని రోజు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం పేరు మార్చి విబిజి రాంజీ అని కొత్త పేరు పెట్టడమే కాక ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారిచే ప్రయత్నం చేస్తుందని ఇది సరైన పద్ధతి కాదని ఉపాధి హామీ చట్టం వల్ల పేద ప్రజలు ఉపాధి పొందుతున్నారని తిండికి లేని పేద ప్రజలు ఉపాధి హామీ చట్టం వల్ల మూడు నెలల పాటు ఉపాధిని పొందుతున్నారని అలాంటి ఉపాధిని ఈనాడు అధికారంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం మోడీ రద్దు చేయడానికి చూస్తున్నారని దీనివలన అనేకమంది ప్రజలు ఉపాధిని కోల్పోతారని ఆయన అన్నారు వెంటనే గ్రామీణ ప్రజానికం ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని తీర్మానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కాకాని కోటేశ్వరావు పనితి కుటుంబరావు ఏర్పుల రాములు సిఐటియు మండల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు

## నెక్కొండ వ్యవసాయ కార్యాలయానికి నూతన కల

**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 13:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం గత నాలుగు దశాబ్దాలుగా సున్నం కూడా చూడని స్థితిలో బూజు పట్టిన గోడలతో నిర్లక్ష్యానికి గురై ఉండేది. అలాంటి కార్యాలయంలోనే వ్యవసాయ అధికారులు విధులు నిర్వర్తిస్తూ రావడం గమనార్హం.ఈ పరిస్థితిని గమనించిన ప్రస్తుత మండల వ్యవసాయ అధికారి నాగరాజు కార్యాలయానికి నూతన రూపు కల్పించారు. కార్యాలయానికి రంగులు వేయించి, లోపల నీటితో శుభ్రంగా కడిగి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పూలదండలతో అలంకరించి, గుమ్మడికాయ కొట్టి, కొబ్బరికాయలు కొట్టి కార్యాలయాన్ని పండుగ వాతావరణంతో కళకళలాడేలా తీర్చిదిద్దారు.నూతన శోభతో కళకళలాడుతున్న కార్యాలయంలో వ్యవసాయ సేవలు అందించడం రైతులకు సానుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా శుభ్రత, ఆత్మీయతతో ఉంటే ప్రజలకు మరింత చేరువ అవుతాయనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందిస్తోంది.




## సాతీ భవాని మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ

**- సేవాలాల్ ఉద్యోగ సేన రాష్ట్ర అధ్యక్షులు భూక్యా బాబులాల్ నాయక్ ఆధ్వర్యంలో బంజారా మేధావులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఏఎంసీ మార్కెట్ చైర్మన్ గుగులోత్ లచ్చిరామ్ నాయక్ పిలుపునివ్వడం జరిగింది**



**తొలి అక్షరం/ఏన్కూర్ జనవరి 14:** ఏన్కూరు మండలం ప్రధాన కేంద్రంలో గిరిజన ఆరాధ్య దైవమైన సాతిభవాని మహా జాతర పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది, సాతీ భవాని జాతర లక్ష్మీదేవిపల్లి మండలం, రేగళ్ల క్రాస్ రోడ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారా మేధావులు సాధవులు నాయకుల సమక్షంలో ఘనంగా జరిగే ఈ ఉత్సవంలో బంజారా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని ఏనుకూరు మండలం ఎఎంసి మార్కెట్ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు భానోత్ శ్రీకాంత్ నాయక్ సేవలాల్ సేన రాష్ట్ర కమిటీ సభ్యులు గుగులోత్ భావుసింగ్ నాయక్ సూర్య తండా మాజీ సర్పంచ్ బానోతు వీరు నాయక్ భగవాన్ నాయక్ తండ మాజీ సర్పంచ్ ప్రసాద్ నాయక్ సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయక్ నాగరాజు నాయక్ అజ్మీర రైలు నాయక్ సేవాలాల్ సేన కార్మిక సంఘం అధ్యక్షులు బోడ రాజు నాయక్ బానోతు వీరు నాయక్ వార్డు మెంబర్ ధరావత్ సురేష్ నాయక్ లకావత్ గణేష్ నాయక్ బోడ బాలు నాయక్ పాల్గొనడం జరిగింది

## స్నేహం తోడైతే సాధ్యం కానిది ఏదీ లేదు - ఇద్దరు స్నేహితుల ప్రభుత్వ ఉద్యోగాల విజయ గాద

**• తల్లిదండ్రులు ఐలి విజయ- రామలింగయ్య**



**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 13:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు స్నేహితులు అయిలి సంజయ్, సన్నాఫ్ ఐలి రామలింగయ్య విజయ. బల్యమిత్రుడు అనుముల శ్రీకాంత్ ఇంటర్మీడియట్ నుంచే కలిసి చదువుతూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని కలలుగన్నారు. నర్సంపేట కళాశాల నుండి కోచింగ్ సెంటర్ వరకు ఎక్కడ చదివినా ఒకరికి ఒకరు తోడుగా ఉండి, సహకారం చేసుకుంటూ, తమ లక్ష్యాన్ని చేరుకున్నారు. వీరి నమ్మకశీ, పట్టుదల, కలిసి చదువుకునే అలవాటు వీరి విజయానికి కారణమయ్యాయి. క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఒకరికి ఒకరు ధైర్యం చెప్పుకుంటూ ప్రోత్సహించుకున్నారు. చివరకు అంకిత భావం పలించి, ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. గతం లో ఈ ఇద్దరు కూడా హెల్త్ డిపార్ట్మెంట్ లో ల్యాబ్ టెక్నీషియన్ గా జనగామ జిల్లా లో విధులు నిర్వర్తిస్తున్నారు,ప్రస్తుతం ఎమ్ హెచ్ ఎస్ ఆర్ బి 2024 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 రిక్రూట్మెంట్ లో భాగంగా అయిలి. సంజయ్ భద్రాద్రి జోన్ లో 14 వ ర్యాంక్ సాధించి చెన్నరావుపేట పీహెచ్ లో పోస్టింగ్ తీసుకున్నారు, అనుముల శ్రీకాంత్ జోన్ 73 వ, ర్యాంక్ సాధించి మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి పోస్టింగ్ తీసుకున్నారు. వీరి గ్రామలైన నర్సంపేట, ఖానాపూర్, కుటుంబ సభ్యల, స్నేహితుల లో ఆనందం వెల్లివిరిసి, అబినందనలు వెల్లివిరిసాయి. స్నేహం అంటే సమయం గడపడం మాత్రమే కాదు, కలిసి కలలు కనడం, కలలు నెరవేర్చుకోవడం, అని ఈ ఇద్దరు స్నేహితులు చెప్పడం విశేషం. వీరి విజయగాథ ఇప్పుడు యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

## చిట్యాల గ్రామస్తులకు తిరుపతి రెడ్డి రూ.50 వేల విరాళం



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 13:**పెద్దవంగర మండలంలోని చిట్యాల గ్రామంలో గ్రామ దేవతలు బొడ్రాయి దుర్గమ్మ ఏర్పాటుకు తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి రూ. 50,116 రూపాయలు విరాళంగా మంగళవారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఆయన స్వగృహంలో కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో జరిపే పండగకు రావాలని కోరారు. విరాళంగా అందించిన తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు కమిటీ తరఫున చిట్యాల గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హరిబాబును సన్మానించిన మాజీ ఎంపీటీసీ రామ్ సునీత శివకుమార్



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 13:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో రామన్నపేట రెండో వార్డు సభ్యునిగా ఎన్నికైన నీర్నంల తాలూకా రామన్నపేట వాస్తవ్యులు సుర్వి హరిబాబు గౌడ్ నీ నీర్నంల మాజీ ఎంపీటీసీ రామ్ సునీత శివకుమార్ హరిబాబుని సన్మానించినారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్ వల్లే. శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## విప్రో కంపెనీ, డీలర్స్ సంతూర్ సంక్రాంతి రంగోలి ముగ్గుల పోటీలు

**తొలి అక్షరం/గంగాధర జనవరి 13:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో విప్రో కంపెనీ వారి ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటర్ శ్రీ ఆంజనేయ ఏజెన్సీ గంగాధర మధుర నగర్ లో సంతూర్ సంక్రాంతి రంగోలి ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగినది ఈ ముగ్గుల పోటీలకు పాల్గొన్న వారికి మొదటి బహుమతి రెండో బహుమతి మూడవ బహుమతి మరియు నాలుగో బహుమతి కన్సోలేషన్ 10 బహుమతులుగా ఇవ్వడం జరిగినది ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధుర నగర్ సర్పంచ్ వేముల భాస్కర్ మరియు గంగాధర ఎస్సై వంశీకృష్ణ చే బహుమతులు ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ సాఫ్ టచ్ డబ్బా మరియు సంతూర్ సోప్స్ ఇవ్వడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు డిస్ట్రిబ్యూటర్ రాజకుమార్, సంతోష్,గంగాధర్, జీూా అనిల్, రాజు,సుమన్ గౌడు వాళ్లు పాల్గొనడం జరిగినది.

# మద్యం వద్దు.. మైదానం ముద్దు

- గర్దాసు విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం







**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 13:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా యువకులకు వాలీబాల్ క్రికెట్ పోటీలను ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహిస్తున్న సందర్భంగా క్రీడ లను రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తవుటం బిక్షపతి ప్రారంభించినారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి యువ నాయకులు సింగన బోయిన గణేష్ , నాయకులు మందడి విద్యాసాగర్ రెడ్డి ఈర్లపల్లి మల్లయ్య ఎండి కాజా గర్దాస్ వెంకటేశం ,నిమ్మగడ్డ పద్మారావు , వెలకుర్తి జానాచారి , కంబాలపల్లి శ్రీశైలం ,యువజన సంఘాల నాయకులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మంత్రి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న గాడిపెల్లి



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 12:** కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న గాడిపెల్లి నాగేశ్వరరావు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పురపాలక సంఘ 14వ వార్డు మాజీ వార్డ్ కౌన్సిలర్, భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ సీనియర్ నాయకులు గాడి పెల్లి నాగేశ్వరరావు తన అనుచర గణంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళి నాయక్, స్థానిక శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ సమక్షంలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ లు వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట పార్టీలో చేరిన వారిలో బూర పూర్ణచందర్, గాడి పెల్లి సంజీవ,రాపోలు ఎల్లయ్య, డోలి శివ, కొత్తం మధు రెడ్డి, రాపోలు వెంకటేష్, ముత్యాల వినయ్, రావుల సంతోష్ రెడ్డి, కుమార్, పనికిరా మల్లేష్, ఆలకుంట్ల మల్లేష్, పెరుమల్ల విజయ్ కృష్ణ, రాపోలు సంతోష్, విజయ్ కుమార్, వేణుమాధవ్, యాకూబ్ పాషా, సాయి, తిలక్, మహేష్, సందీప్, అలిమ్, సంజయ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు సస్పెన్షన్: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి




**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 13:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని అలంకాని పేట గ్రామానికి చెందిన 1.సముద్రాల కనకయ్య 2.గాజుల కృష్ణ 3.గుంటుక భద్రయ్య అను వారిని మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శ్రీమతి రాంపల్లి నిరోష కి పనిచేయకుండా టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి అనుకూలంగా పనిచేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కి వ్యతిరేకంగా పనిచేసిన సందర్భంగా అలంకాని పేట గ్రామ కాంగ్రెస్ పార్టీ తీర్మానం మేరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగింది. కావున ఈరోజు నుండి వీరికి కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధంలేదు.

# మైసమ్మ తల్లి మమ్మల్ని చల్లంగా చూడమ్మా

- ముగిసిన ఉప్పరిగడ్డ మైసమ్మ బోనాల పండుగ
- డప్పుల సందడితో హోరెత్తిన ఉప్పరిగడ్డ గ్రామం
- సర్పంచ్ చందు నాయక్ అధ్వర్యంలో ఘనంగా మైసమ్మ తల్లి పండుగ సంబరాల
- మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించిన గ్రామస్తులు





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 13:** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామం లో సర్పంచ్ చందు నాయక్ అధ్వర్యంలో ఘనంగా మైసమ్మ తల్లి బోనాల పండుగ జరుపుకున్నారు. మూడు రోజులపాటు జరిగిన ఈ బోనాల పండుగ ను గ్రామస్తులు ఆటపాటలతో ఊరు ఊరంతా బోనాలతో పాటు కొడ్లు, యాటలు మొక్కుబడులు సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందు నాయక్ మాట్లాడుతూ గ్రామ దేవత మైసమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్థులతో కలిసి జరుపుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. మైసమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం లో పాడిపంటలు సుబిక్షంగా ఉండాలని కోరారు. మైసమ్మ తల్లి చల్లని దీవెనలతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యలతో ఉండాలని తెలిపారు. డప్పుల సందడితో గ్రామస్తులు బోనాలు మైసమ్మ తల్లికి సమర్పించారు. ఇందులో గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# రైతు వేదికలో అర్రివ్ అలీవ్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్ఐ ప్రమోదుకుమార్ గౌడ్




**పెద్దవంగర జనవరి13 తొలి అక్షరం:** మండలంలోని రైతు వేదికలో జరిగిన అర్రివ్ అలీవ్ కార్యక్రమం లొ ఎస్ ఐ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు వివరించడం జరిగింది. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడింగ్, నిద్రమత్తు వల్ల ప్రమాదాలు జరుగుతాయని ప్రతి ఒక్కరు హెల్మెట్ సిటిబెల్టు తప్పక ధరించాలని తెలిపారుఆటోలు ఓవర్ లోడు ప్రయాణికులు ప్రయాణించకూడదని రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయకూడదనిరాంగ్ పార్కింగ్ చేయకూడదని ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత గోల్డెన్ అవర్ గురించిఅది ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ఉండి 108 కు కాల్ చేయాలి లేదా మన యొక్క వాహనంలో వారిని దగ్గరలో ఉన్న హాస్పిటల్ తీసుకువెళ్లాలని తెలియచేసినారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్ తహసీల్దార్ ఆర్ ఐ లస్కర్ సర్పంచ్ ముద్దసాని పారిజాతం వివిధ గ్రామంలో ఉన్న ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గృహజ్యోతి పథకం పేద ప్రజలకు వరం







**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 13:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన గృహజ్యోతి పథకం పేద ప్రజలకు వరమని చౌటుప్పల్ విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ ఎస్.మల్లికార్జున్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కే.శ్రీకాంత్ లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వెల్లంకి, సిరిపురం గ్రామాలలోనీ వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలుపుతూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు సందేశం ఇవ్వడంతో పాటు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ జారీ చేసిన ప్రతులను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని రామన్నపేట మండలం లో గృహ జ్యోతి పథకం ఉచిత విద్యుత్ లబ్ధిదారులు10267, వ్యవసాయ రైతులు 8582 , వలిగొండ మండలంలో గృహజ్యోతి పథకం ఉచిత విద్యుత్ లబ్ధిదారులు 11745, వ్యవసాయ లబ్ధిదారులు 11664 మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు.వారి వెంట రామన్నపేట ఏఈ వి. కోటేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# శంకరన్న చేతుల మీదుగా గంగపుత్ర క్యాలెండర్ ఆవిష్కరణ



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 13:** గంగపుత్ర సంఘం క్యాలెండర్ ను మాజీ శాసనసభ్యులు భానోత్ శంకర్ నాయక్ ఆవిష్కరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాజీ శాసనసభ్యులు శంకర్ నాయక్ క్యాంప్ కార్యాలయంలో గంగపుత్ర ఫిషర్మెన్ సంఘం యొక్క నూతన సంవత్సర 2026 క్యాలెండర్ మాజీ శాసనసభ్యులు బానోతు శంకర్ నాయక్ చేతుల మీదుగా మన సంఘం యొక్క క్యాలెండర్లు ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగపుత్రులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని గంగపుత్రులంటేనే చేపల వృత్తిపై జీవించేవారని చేపలు పట్టే సమయంలో ఏర్పడే ఇబ్బందులను అధిగమించి వృత్తిని కొనసాగాలించాలన్నారు కష్ట నష్టాలు ఏర్పడినప్పుడు సహాయం చేయడానికి ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు దేశబోయిన రాధాకృష్ణ కార్యదర్శి పొక్కుల శ్రీనివాస్ కోశాధికారి దేశబోయిన శ్రీకాంత్ కార్యవర్గ సభ్యులు డోలి శేఖర్ మైస వెంకటేశ్వర్లు చంద్రగిరి యాదగిరి నాగుల శ్రీధర్ డోలి వీరేందర్ గంగపుత్ర సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె బాటలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

- ప్రతి నెల 1వ తారీకున జీతాలు ఇవ్వాలి




**పెద్దవంగర జనవరి 13తొలి అక్షరం:** మండలంలోని పల్లెదవ ఖానా ఎం ఎల్ హెచ్ పి లు రాజకుమార్ మాట్లాడుతూ 12- 01- 2026 రోజున ఎన్ హెచ్ ఎం కమిషనర్ ఆఫీసులో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగినది. 13.01.2026 రోజున డి ఎం ఎచ్ ఓ వారికి సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది గత నాలుగు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూసి చూసి ఎన్నో ఇబ్బందులు అనుభవించుకుంటూ ఉద్యోగం చేసుకుంటూ ఇటు కుటుంబ భారంతో కూడా ప్రజల ఆరోగ్యం కోసం ఎన్ హెచ్ ఎం ఉద్యోగస్తులు ఎన్నో కష్టాలు అనుభవించారు. కొంతమందికి దసరా ముందు నుండి సంక్రాంతి వరకు జీతం లేకపోవడం గమనరహం. ప్రతి పండగ ముందు ఎన్ హెచ్ ఎం ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వకపోవడం చాలా బాధాకరమని తెలియజేస్తున్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా కూడా ఉద్యోగం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పథకాలని పల్లెల వరకి సామాన్య ప్రజల వరకు చేరవేసేది ఎన్ హెచ్ ఎం ఉద్యోగి అని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. అన్నారు

ఈ నెల 14 తేదీ నుండి 21 తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని వైద్య ఆరోగ్య సేవలను కొనసాగించుకుంటూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బంది కలగకుండా నిరసనలు తెలియజేస్తామన్నారు. 21వ తారీకు వరకు జీతం పడకపోతే 22 తారీకు రోజు సమ్మెకు దిగుతామని ఎన్ హెచ్ ఎం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు తెలియజేశారు. అలాగే దయచేసి ప్రభుత్వాన్ని కోరుకునేది ఏమిటంటే ఇలా వేతనాల కోసం ఇబ్బంది పెట్టకుండా ప్రతి నెల ఒకటో తారీకు నుండి 5వ తారీఖు లోపు ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు అందరికీ వేతనాలు వెయ్యాలని మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ ఎన్ హెచ్ఎం జేఏసీ డిమాండ్ చేస్తున్నారు

# నేటి నుండి ప్రారంభమైన బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థుల దరఖాస్తులు

- ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించిన బిజెపి పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ పటేల్




**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 13:** త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేసేందుకు షాద్నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఆసక్తిగల నాయకులు దరఖాస్తు చేసుకోవచ్చని భారతీయ జనతా పార్టీ షాద్నగర్ మున్సిపాలిటీ అధ్యక్షులు హరి భూషణ్ పటేల్ తెలిపారు. మంగళవారం నుండి ప్రారంభమైన ఈ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 16 వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు చేరవేయాలనే ప్రధాన లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ సైనికులు పనిచేస్తారని వెల్లడించారు.ఈ దరఖాస్తులను జనవరి 13, 14, 15 తేదీలలో (మూడు రోజుల పాటు) స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సీఎస్కే కాలనీ, విల్లా నెంబర్ 670, భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయదలచిన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలనే లక్ష్యంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం ఎంపీ డి.కె. అరుణమ్మ, మార్గదర్శకత్వంలో తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సేవాభావంతో ముందుకు వచ్చే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# విజేతలకు బహుమతులు అందించిన అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి సర్పంచ్ సిరిపురం



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 13:** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించినారు ప్రథమ బహుమతి మామిడి విజయ ద్వితీయ బహుమతి రాపోలు నాగలక్ష్మి తృతీయ బహుమతి రాపోలు రూప శ్రీ లకు బహుమతి అందించి వారికి అభినందనలు తెలిపినారు ఈ కార్యక్రమంలోగ్రామపంచాయతీ కార్యదర్శి జ్యోతి ఉప సర్పంచ్ మూడుదుడ్ల అనుష రమేష్ వార్డ్ సభ్యులు జెల్ల సూర్య కళ గాదె శంకరయ్య కూనూరు రమేష్ పొన్న వెంకటేష్ పగడాల లక్ష్మి మోటే స్వామి కంకల అర్చన కట్ట భాను శ్రీ గాదె యాదయ్య గుంటోజు కృష్ణమాచారి సంగిశెట్టి . మహేష్ కారోబార్ తుంగ యాదగిరి కంకాల హరీష్ సురేష్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# గిరాయి గుట్ట తండా బీటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు నేడు నిలబెట్టుకున్నారు

### తండాల అభివృద్ధికి ఎన్ని కోట్లయినా వెనుకాడేది లేదన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### పట్టణాలకు దీటుగా తండాలను అభివృద్ధి చేస్తామన్నారు - కృష్ణవేణి హరీష్ నాయక్

### పార్టీలకతీతంగా తండాలను అభివృద్ధి చేస్తున్నామన్న ఎమ్మెల్యే

### అభివృద్ధిపై దృష్టి సారించండి మీకు అండగా నేనుంటా: ఎమ్మెల్యే

### రోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే తో పాటు పాల్గొన్న సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్







**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 13:** ఫరూక్‌నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామం నుండి గిరాయిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి గుట్ట వరకు బిటి రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహాయ సహకారంతో ఈరోజు శంకుస్థాపన చేయడం జరిగిందని శంకరన్న హామీ ఇచ్చి సంవత్సరం పూర్తి కాకముందే మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఈ రహదారి పూర్తయితే భక్తులు,స్థానికులకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగవుతుందని తెలిపారు.అదేవిధంగా ఎమ్మెల్యే శంకరన్న సహకారంతో గ్రామపంచాయతీలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి, వాటిని దశలవారీగా పరిష్కరిస్తామని గ్రామ పాలకవర్గం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని, ప్రజల సహకారం తో అన్ని సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు.గ్రామంలో రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని గ్రామ పాలకవర్గం తెలియజేసింది. షాద్నగర్ నియోజకవర్గం లోని తండాల అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ఖర్చు చేయడానికి వెనుకాడేది లేదని పట్టణాలకు దీటుగా తండాలను అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా తండాలను అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణవేణి హరినాయక్,ఉప సర్పంచ్ రాజు కంసాన్ పల్లి సర్పంచ్ గీతా యాదయ్య,వార్డు సభ్యులు రాణి పాండు , రాజు , మౌనిక రమేష్ , పవన్ కుమార్, సరిత నరేష్ బాబు, సువర్ణ మురళి, సరిత కిషన్ , మాజీ వార్ సభ్యులు బాలు, శంకర్, పూజారి పెంటు, డాక్టర్ రవి, మండల మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఖాజ ఎద్రిస్ పాషా, పులిచెర్లకుంట సర్పంచ్ రాజు తండా పెద్దలు నాయకులు యువజన సంఘం నాయకులు మహిళలు పెద్దశంకర పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి మీడియా మూడో కంటిగా నిలవాలి: వేం నరేందర్ రెడ్డి

### వైభవంగా 'మానుకోట టైమ్స్ డిజిటల్ మీడియా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

### ప్రభుత్వం - ప్రజల మధ్య విశ్వసనీయ వారధిగా మీడియా వ్యవహరించాలి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు స్పష్టం





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 12:** ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వానికి పత్రికలు, న్యూస్ ఛానళ్లు బలమైన వెన్నుదన్నుగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర కేవలం వార్తల ప్రసారం వరకు మాత్రమే కాకుండా, ప్రజల గొంతుకగా, ప్రభుత్వానికి మూడో కంటిగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.మంగళవారం కేసముద్రలోని ఆయన నివాసంలో 'మానుకోట టైమ్స్ డిజిటల్ మీడియా నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎంపీ పోరిక బలరాం నాయక్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డిలతో కలిసి ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రాజకీయ, మీడియా వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**బాధ్యతాయుత జర్నలిజమే ప్రజల నమ్మకం** ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తించి, వాటిని నిర్మాణాత్మకంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను ప్రజల ముందుంచడమే నిజమైన జర్నలిజమని పేర్కొన్నారు.

**స్థానిక సమస్యలకు ప్రాధాన్యం ఇస్తున్న మానుకోట టైమ్స్‌కు ప్రశంసలు** ప్రాంతీయ సమస్యలను ప్రధానంగా తీసుకుని ప్రజల మధ్య విశ్వసనీయతను సంపాదించుకుంటున్న 'మానుకోట టైమ్స్ డిజిటల్ మీడియా సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. క్యాలెండర్ రూపకల్పనలో చూపిన సృజనాత్మకత, ఆకర్షణీయమైన డిజైన్, ప్రజాపక్షపాత దృక్పథం ఛానల్ నిబద్ధతను చాటుతున్నాయని అన్నారు. జర్నలిజం విలువలను కాపాడుతూ, ప్రజల పక్షాన నిలబడుతూ ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానుకోట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదళ్ల యాదవ రెడ్డి, మాజీ జెడ్పిటిసి హెచ్. వెంకటేశ్వర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, కురెల్లి సతీష్, అల్లం నాగేశ్వరరావు పాల్గొన్నారు.అలాగే ఛానల్ అధినేత బొడ్డు అశోక్, కెమెరామెన్ చదల యాకాంతం, సీనియర్ రిపోర్టర్ సింగారపు నాగేంద్రప్రసాద్, నాయకులు జగన్ బాబు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహబూబాబాద్‌లో ఘనంగా డిస్ట్రిక్ట్ ప్రైవేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



### డీఈవో రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరు

### ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవోకు వినతి

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 12:** మహబూబాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ ప్రైవేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎగ్జామ్ బ్రాంచ్ ఇన్‌చార్జి శ్రీరాములు సార్, చింతపల్లి హెడ్మాస్టర్ శంకర్ సార్, డీఆర్ కాలేజ్ అధ్యాపకుడు మల్లేశం సార్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని కార్యక్రమానికి శోభ చేకూర్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు గండు మురళి మాట్లాడుతూ, ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఈవో రాజేశ్వరరావు గారికి వివరించారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత, వేతనాల అంశాలు, విద్యా నాణ్యత పెంపు కోసం అవసరమైన చర్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. దీనికి స్పందించిన డీఈవో రాజేశ్వరరావు ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత వరకు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చేపూరు రవి, కోశాధికారి రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు వినోద్, మహేశ్వర్ సార్‌తో పాటు పలువురు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరణను విజయవంతం చేశారు.

# గంగాధర బాలకార్మికుడుని గుర్తించి పట్టుకున్న ఆపరేషన్ స్మైల్ బృందం



**తొలి అక్షరం/గంగాధర జనవరి 13:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్‌లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పని ప్రదేశాలలో బాల కార్మికులను గుర్తించడానికి ఏర్పాటైనటువంటి "ఆపరేషన్ స్మైల్ " అధికారుల బృందం ఈరోజు అనగా 13/01/2026 గంగాధర మండలంలో పర్యటించి మధుర నగర్ లోని కైలాస్ చాట్ భండార్ వద్ద పనిచేస్తున్నటువంటి 14 సంవత్సరాల వయస్సు గల కన్నయ్య లాల్ మీనా అను బాల కార్మికుడిని గుర్తించడం జరిగింది. ఆ బాలుడని పాఠశాలకు వెళ్ళనీయకుండా తనతో పాటు ఉంచుకొని పని చేయించుకు ంటున్నటువంటి చాట్ భండార్ యజమాని ఐన సురేష్ చంద్ర గుర్జార్ తీ/శీ రాజస్థాన్ అను వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

# సంక్రాంతికి గ్రామ పంచాయతీలకు సంబరం

### - రూ.277 కోట్ల నిధుల విడుదలతో గ్రామాభివృద్ధికి కొత్త ఊపిరి

### - ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం: రాజుల కొత్తపల్లి ఉప సర్పంచ్ గణేష్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 12:** నెల్లికుదురు మండల కేంద్రంలోని రాజుల కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ గణేష్ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు తీపి కబురు అందించిందని తెలిపారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడేలా రూ. 277 కోట్ల నిధులను విడుదల చేయడం గ్రామస్థుల్లో ఆనందాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు.గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం మేరకు ఆర్థిక శాఖ అధికారులు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు రూ. 277 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేశారు.ఈ నిధుల విడుదలకు సంబంధించి సోమవారం ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొని నిధుల పంపిణీపై సమీక్షించారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు వంటి అభివృద్ధి పనులకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

# హనుమాన్ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా...

### - ఆలయ చైర్మన్ రాచూరి విష్ణువర్ధన్ రెడ్డి

### -ఆలయ చైర్మన్‌కు ఘన సన్మానం చేసిన గ్రామ సర్పంచ్ విక్రమ్ రెడ్డి



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 13:** గంగన్నగూడ గ్రామ ప్రజల విశ్వాసంతో హనుమాన్ దేవాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాచూరి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...ఆలయ అభివృద్ధితో పాటు హైందవ ధర్మ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి గ్రామ పెద్దలు, యువకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రతి ఒక్కరూ ధర్మరక్షణలో భాగస్వాములు అయ్యేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. హనుమాన్ దేవాలయాన్ని మరింత సుందరంగా అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేసే వ్యక్తిగా రాచూరి విష్ణువర్ధన్ రెడ్డిని ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నామని, ఆయన నాయకత్వంలో దేవాలయానికి మరింత కీర్తి ప్రతిష్టలు చేకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం గంగన్నగూడ గ్రామ సర్పంచ్ విక్రమ్ రెడ్డి నూతనంగా ఎన్నికైన ఆలయ చైర్మన్ రాచూరి విష్ణువర్ధన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం





**గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుంది**

**పట్టణ అభివృద్ధికి 59.62, కోట్లు మంజూరు చేసి 24. కోట్ల13 లక్షల తోపలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 13:** ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సమన్వయంతో అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంగళవారం పురపాలక సంఘ పరిధిలో గల పలు అభివృద్ధి పనులకు గాను శంకుస్థాపనలు, శిలాఫలకాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇన్చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి మంత్రి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే శిలాఫలకాలను ప్రారంభించారు.ఇందులో భాగంగా పురపాలక సంఘ పరిధిలోని గల ఇల్లందు రోడ్ లోని 17వ వార్డులో రూ. 55 లక్షల విలువ కలిగిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పైపు లైన్ నిర్మాణం, అదే విధంగా బేతోలు పరిధిలోని 6వ వార్డులో రూ. 50 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, అలాగే రూ. 7 కోట్లతో బంధం చెరువు సుందరీకరణ పనులు, రూ. 64 లక్షల వ్యయంతో 19వ వార్డులోని పలు అభివృద్ధి పనుల కోసం, అంతే కాకుండా రూ. 40 లక్షల వ్యయంతో 33వ వార్డు, తహసిల్దార్ కార్యాలయం వద్ద అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, రూ. మూడు కోట్లతో 23వ వార్డులో అంతర్గత రోడ్లు, రూ. 59 లక్షల వ్యయంతో జంక్షన్ పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, రూ. 12 కోట్ల వ్యయంతో 11వ వార్డులోని నందన గార్డెన్ రోడ్డు నందు హస్తినాపురం కాలనీ అభివృద్ధి, వరద ముంపు నివారణకు మురుగు కాలువల నిర్మాణ పనులు, రూ. 50 లక్షల వ్యయంతో ఇల్లందు రోడ్డులో గల 6, 17వ వార్డు జ్యోతిరావు పూలే జంక్షన్ ప్రాంతం అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, రూ. కోటి రూపాయల వ్యయంతో 32, 18వ వార్డులలో బొడ్రాయి సెంటర్ ప్రాంతం అభివృద్ధి పనులకు, రూ. కోటి వ్యయంతో 13, 14వ వార్డుల్లో మోర్ సూపర్ మార్కెట్ వద్ద బస్టాండ్ రోడ్డు అభివృద్ధి పనులకు గాను శంకుస్థాపనలు చేసి, శిలాఫలకాలు వేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, పురపాలక సంఘ కమిషనర్ రాజేశ్వర్, డి ఈ చిప్ప ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య, బుజ్జి వెంకన్న, ఓం నారాయణ, మూడు బాలు చౌహాన్, నరసింగం శ్రీనివాస్, చౌడారపు మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ కాంత్, గోని శ్యామ్, తిప్పర్తి శ్రీధర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తతండ మంగళ్ తండ రహదారికి కదిలిన రాజకీయ చక్రం

- ఎంపీ బలరాం నాయక్ ముందు ఉంచిన గ్రామాల ఆశలు
- కేసముద్రంలో వేం నరేందర్ రెడ్డి నివాసంలో కీలక భేటీ
- ఎస్టిమేట్ కాపీతో రహదారి మంజూరుకు స్పష్టమైన అడుగు



**తొలి అక్షరం/ఇనుగుర్తి జనవరి 12:** కేసముద్రం మండల కేంద్రంలో వేం నరేందర్ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమం గ్రామీణ అభివృద్ధిపై కొత్త ఆశలను రేకెత్తించింది మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ను ప్రజాప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించి కొత్తతండ నుండి మంగళ్ తండ వరకు అత్యంత అవసరమైన రహదారి మంజూరు చేయాలని కోరారులక్ష్మీపురం గ్రామ సర్పంచ్ ముదిరెడ్డి కళావతి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీని కలిసి గ్రామాల మధ్య రవాణా ఇబ్బందులను వివరించారు ఈ రహదారి లేక ప్రజలు విద్య వైద్యం వ్యవసాయ అవసరాల కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారురహదారి నిర్మాణానికి సంబంధించిన పూర్తి ఎస్టిమేట్ కాపీని ఎంపీ బలరాం నాయక్‌కు అందజేయగా అంశాన్ని గంభీరంగా పరిశీలిస్తానని సంబంధిత శాఖల అధికారులతో చర్చించి మంజూరుకు చర్యలు తీసుకుంటానని ఎంపీ హామీ ఇచ్చినట్లు నేతలు వెల్లడించారుఈ సమావేశంలో నామినేటెడ్ సభ్యులు ఉప సర్పంచ్ బద్రి నాయక్ వార్డు మెంబర్ అశోక్ పార్టీ నాయకులు మల్లయ్య యాకుబ్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు సతీష్ మార్కెట్ డైరెక్టర్ రాము తదితరులు పాల్గొని రహదారి మంజూరుపై తమ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు

# గిరాయి గుట్ట తండా బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- బీటి రోడ్డు నిర్మాణానికి 3.5 రూ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే
- గిరిజన సంక్షేమం శాఖ నుండి మంజూరైన నిధులు
- గిరాయిగుట్ట తండా బీటి రోడ్డు నిర్మాణం రెండు నెలల్లో పూర్తి చేస్తాం
- కాంట్రాక్టర్లకు అధికారులకు సహకరించండి అప్పుడే పనులు త్వరగా పూర్తవుతాయి
- రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాల గురించి ఆలోచించాలి తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలి





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 13:** షాద్ నగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామం నుండి గిరాయి గుట్ట తండా శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి దాదాపు 3.5 కోట్ల నిధులతో నేడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గిరాయి గుట్ట తండా సర్పంచ్ కృష్ణవేణి హరినాయక్ మరియు ఫరూక్నగర్ మండలం మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ రెడ్డి, ఫరూక్నగర్ మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క బాలరాజ్ గౌడ్, మరియు లింగారెడ్డి గూడా గ్రామ ఉపసర్పంచ్ అశోక్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ముందుగా చల్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం గిరాయిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్న తప్పకుండా భేటీ రోడ్డు మంజూరు చేయిస్తానని మాట ఇచ్చిన సందర్భంగా ఈరోజు ఆ రోడ్డు మార్గం శంకుస్థాపన చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఇబ్బందుల్లో ఉన్నా కూడా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీ సాక్షిగా నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావనకు తీసుకువచ్చి గట్టిగా మాట్లాడిన విషయం మనందరికీ తెలుసు పట్టణాలకు సమానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తండాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ట్రైబల్ వెల్ఫేర్ స్కీం కింద నిధులు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే గెలుపోటముల గురించి ఆలోచించాలి తర్వాత నాయకులందరూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంసాన్ పల్లి నరేందర్ రెడ్డి మాట్లాడుతూగిరాయి గుట్ట తండా బీటి రోడ్డు శంకుస్థాపనకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రావడం చాలా అభినందనీయమని అన్నారు. ఎంతోమంది నాయకులు వచ్చారు వెళ్లారు కానీ ఇప్పటివరకు గుడికి రోడ్డు మంజూరు చేయించలేకపోయారని అన్నారు. ఎమ్మెల్యే శంకరన్న వచ్చిన తర్వాతనే ఈ రోడ్డు మంజూరు చేయించారు ఆయన మాటల మనిషి కాదు చేతల మనిషి అని మరొకసారి నిరూపితమైంది ఎమ్మెల్యే శంకర్ అన్న మారుమూల తండాలలో సైతం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ముందుగా నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులకు వార్డు మెంబర్లకు ఉప సర్పంచ్లకు అభినందనలు తెలియజేశారు. మనందరి ఆరాధ్య దైవం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రావడం ఇక్కడ రోడ్డు శంకుస్థాపన చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ గుడి నిర్మాణానికి బూర్గుల రామకృష్ణారావు కుటుంబ సభ్యులు సహకరించారని అన్నారు. ముఖ్యంగా గిరిజన తండాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని ఉద్దేశంతో కాంట్రాక్టర్లకు సహాయ సహకారాలు అందిస్తున్నామని ఎక్కడ బిల్లులకు జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ముఖ్యంగా గ్రామాల్లో ఉండే నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించాలని పార్టీలు మనకు ముఖ్యం కాదు మన గ్రామ అభివృద్ధి మనకు ముఖ్యం పార్టీలకతీతంగా నాయకులు అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఎన్నికలు ఉన్నంతవరకే రాజకీయాలు ఎన్నికల తర్వాత అంతా అభివృద్ధి పై దృష్టి పెట్టాలని అన్నారు. ఎందుకంటే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు అనే మాటే ఉండదు దయచేసి మిమ్మల్ని కోరేది ఒక్కటే కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టకండి వారికి సహకరించండి. నియోజకవర్గంలో ఎక్కడ కాంట్రాక్టర్లకు ఇబ్బంది రాకుండా వారికి సహకరిస్తున్నాం అందుకే అభివృద్ధి పనులు శరవేగంతో ముదుకుపోతున్నాయని అన్నారు. రెండు రోజుల్లోనే షాద్నగర్ మున్సిపాలిటీలో 40 కోట్ల రూ.లతో అభివృద్ధి పనులు చేపట్టాం అందుకే పనులు శరవేగంగా ముందుకు పోతున్నాయని అందుకే ఎక్కడ కాంట్రాక్టర్లకు అధికారులకు ఇబ్బంది కలిగించకుండా చూసుకోవాలని కోరారు ఈ బీటీ రోడ్డు నిర్మాణం రెండు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# ట్రాఫిక్ రూల్స్‌ను పాటిద్దాం.... జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా కొనసాగుదాం

**రాయికల్‌లో 'Arrive Alive' అవేర్నెస్ కార్యక్రమం**

**హాజరైన షాద్నగర్ జోన్ ఫ్యూచర్ సిటీ డిసిపి శిరీష , ఏసిపి లక్ష్మీనారాయణ,పట్టణ సీఐ విజయకుమార్**

**జీవం లేని మొబైల్ ఫోన్‌కు స్క్రీన్ గార్డ్, పౌచ్ వేసుకునే మనం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా భావించాలి**





**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 13:** ఫరూఖ్ నగర్ మండలం రాయికల్ గ్రామ సర్పంచ్ కే. జ్యోతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఫ్యూచర్ సిటీ కమిషనర్ డీసీపీ శిరీష హాజరయ్యారు. రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా Arrive Alive కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయకుమార్, ఎస్సై సుశీల, ట్రాఫిక్ ఎస్సైతో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 300 మంది గ్రామస్తులతో ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. **డీసీపీ శిరీష సూచనలు** డీసీపీ శిరీష మాట్లాడుతూ... గ్రామ స్థాయి నుండే ట్రాఫిక్ నింబనలను పాటించేలా చైతన్య పరిచేందుకు రోడ్డు భద్రత మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తల్లి తండ్రులకు అవగాహన కల్పించారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు వాహనాలు నడపరాదని, ఫిట్నెస్ లేని వాహనాల వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదం ముందుగా చెప్పి రాదని, డ్రైవ్ చేసే ప్రతి క్షణం జాగ్రత్త అవసరమని స్పష్టం చేశారు. ఒక్క తప్పుతో కుటుంబాలను అంధకారంలోకి నెట్టవద్దని హెచ్చరించారు. ప్రమాదాల బారిన పడినప్పుడు మెరుగైన వైద్యం ఖర్చుతో కూడుకున్నదని, అలాంటి సందర్భాల్లో వాహన ఇన్సూరెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు కేసుల పాలవ్వొద్దని సూచించారు. జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా అవేర్నెస్ కార్యక్రమాలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఒక్కసారి ప్రాణం పోతే తిరిగి రాదు. మీ భద్రతకు మేము బరోసాగా నిలుస్తున్నాం. ట్రాఫిక్ రూల్స్ ను పాటించి సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోండి. హెల్మెట్, సీట్‌బెల్ట్ మీ ప్రాణాలకు రక్షణ కవచం అని సూచించారు. జీరో యాక్సిడెంట్ దిశగా కలిసి కృషి చేద్దాం అని అధికారులు పిలుపునిచ్చారు. ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో సగటున ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం గణాంకం కాదని, ఒక్క ప్రమాదం ఒక కుటుంబాన్ని జీవితాంతం చీకట్లోకి నెట్టే విషాదమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని స్పష్టం చేశారు. **నిబంధనలు పాటించకపోతే...ఆటో కెమెరాలతో చలాన్లు** సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లో రోడ్లపై ఆటోమేటిక్ కెమెరాలు ఏర్పాటు చేశామని, నిబంధనల ప్రకారమే పనిచేస్తాయని తెలిపారు. చలాన్లు పడుతున్నాయని ఆర్థిక నష్టం అంటూ బాధపడే ముందు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే నష్టమే ఉండదని సూచించారు. గ్రామ స్థాయి నుంచే అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. **ఒక్క చిన్న తప్పు.. కుటుంబాలకు శ్లోకాలు** డ్రైవ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగం ప్రాణాంతకమని హెచ్చరించారు. ఒక్క చిన్న నిర్లక్ష్యం కుటుంబాలకు శ్లోకాలు మిగిల్చే పరిస్థితికి దారి తీస్తుందని అన్నారు. వాహనం నడిపే ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచ్ కె జ్యోతి శ్రీనివాస్ మాట్లాడుతూ.... ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించినప్పుడే మగమ్మ స్థానాలను సురక్షితంగా చేరుకుంటామని,తల్లిదండ్రులు ఇంటి నుండి తమ పిల్లలు బయటికి వెళ్లే ముందు కచ్చితంగా హెల్మెట్ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి , సురక్షితంగా ఇంటికి చేరుకునేలా తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. **గ్రామస్తులు మాట్లాడుతూ...టోల్ గేట్ సమస్యపై వినతి** రాయికల్ ప్రాంతం టోల్ గేట్‌కు సమీపంలో ఉండటంతో, స్థానిక ప్రజలు, రైతులకు టోల్ చెల్లింపుల్లో ఉపశమనం కల్పించాలని ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులకు గ్రామస్తులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసుల గ్రామస్తులు ఆర్టిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభోత్సవం: ఎస్సై కృష్ణయ్య

● మైదానంలో సిక్సర్ల ఫోర్‌లతో యువత అలరించారు



**తొలి అక్షరం/మాడుగులపల్లి/ జనవరి: 13:** మాడుగులపల్లి మండలం ఆగమోత్కూర్ గ్రామంలోని సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాడుగులపల్లి ఎస్సై కృష్ణయ్య హాజరై రుబ్బెన కటింగ్ చేసి ఘనంగా మంగళవారం ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి టాస్ వేసి , బ్యాటింగ్ చేసి ఆయన టోర్నమెంట్ ఉత్సాహంగా మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చదువుతో పాటు క్రీడాలో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. నిత్యం క్రీడలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. గెలుపు ఓటమి సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల వైపు మొగ్గు చూపాలని ఆయన ఆకాంక్షించారు. **ఆటలు ఆడటం వల్ల కలిగే లాభాలు** శారీరక ఆరోగ్యము కాకుండా మానసిక ఉల్లాసం మరియు సామాజిక నైపుణ్యాలు కూడా పెరుగుతాయి. క్రమం తప్ప కుండా క్రీడలు ఆడటం వలన రక్త ప్రసరణ మెరుగుపడి, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఎముకల సాంద్రత పెరుగుతుంది, కండరాల దృఢంగా తయారవుతాయి, శరీరంలోని రోగ నిరోధక శక్తి పెరిగి త్వరగా జబ్బులో బారిన పడకుండా ఉంటాము అని అన్నారు. ఆటలో గెలవడం లేదా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం వల్ల వ్యక్తిగత ఆత్మవిశ్వాసం పెరుగుతుంది , క్రమశిక్షణ సమయపాల నియమాలను పాటించడం మంచి అలవాటు క్రీడల ద్వారా అలవాడతాయి అని యువతకు తెలిపారు. ఈ పోరులో విజేతలుగా నిలిచిన ప్రథమ బహుమతి ఆగమోత్కూర్ టీం, ద్వితీయ బహుమతి బొమ్మకల్ టీం, ప్రతిభ కనబరిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సాధించిన బొల్లెపల్లి రాజు లకు శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో దాతలు పాల్వాయి రాంరెడ్డి, యం .డి జాఫర్ , శ్రీకాంత్, భూపతి ,నరేష్ ,బంటు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మాకు రావలసిన అన్ని రకాల బకాయిలు మేము జీవించి ఉండగానే చెల్లించాలి




● వరంగల్ రీజియన్ విశ్రాంత ఉద్యోగులు

**తొలి అక్షరం/వరంగల్:** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని వరంగల్ రీజియన్ విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ డిపోలలో వివిధ హోదాలలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులం. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి డిపో అభివృద్ధిలో,ఆర్టీసీ అభివృద్ధిలో మా యొక్క పాత్ర సింహభాగం ఉండే విధంగా పోషించి ఆర్టీసీని నిలబెట్టాము.అయితే మేము రిటైర్ అయిన తర్వాత 2017 నుండి ఇప్పటివరకు (09 సం"ల కాలం) రిటైర్మెంట్ సెటిల్మెంట్లు సంస్థ ద్వారా రావలసినవి రాకపోవడం మూలంగా రకరకాల ఇబ్బందులు పడుతున్నాం.ముఖ్యంగా ౹రూా 2017 అరియర్స్ , 2017 ఏప్రిల్ నుండి 2024 ఏప్రిల్ వరకు రావాల్సిన గ్రాట్యుటి, లీవ్ ఎన్క్యాష్మెంట్ డిఫరెన్స్ మరియు 2024అక్టోబర్ నుండి 2025 డిసెంబర్ వరకు రావాల్సిన లీవ్ ఎన్క్యాష్మెంట్ డబ్బులు, జజూ సెటిల్మెంట్లు, ఆగస్టు'2025 నుండి డిసెంబర్ణ2025 వరకు రావలసిన గ్రాట్యుటీ లాంటి బకాయిలు చట్ట ప్రకారం తక్షణమే చెల్లించాల్సి ఉండగా, సమయ భావంతో దాత్సర్యం చేసుకుంటూ,ఇప్పటివరకు చెల్లించలేదు. వీటికి తోడు వచ్చే అర కొర పెన్షన్ పత్రాలలో కొన్ని సూక్ష్మ లోపాలు ఉన్నాయని వాటిని జూఖీూ వారు తిరస్కరణకు గురిచేసి ఇబ్బందులు పెడుతున్నారు. డీ.డీ.లు చెల్లించిన కొందరికి " హయ్యర్ పెన్షన్‌లి " 20 నెలల గడచిననూ ఇంకా సాంక్షన్ చేయడం లేదు. సంస్థ యాజమాన్యం 2013, 2017 వేతన వివరాలను జూఖీూ కు పంపకుండా పెన్షన్ పెరిగే అవకాశం లేకుండా చేయడం వల్ల పూర్తిగా నష్టపోతున్నాం. ఆర్టీసీలోని రిటైర్డ్ ఉద్యోగులందరం అప్పులు తీరక,అధిక వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ కొందరు అకాల మరణం చెందుతున్నారు. పిల్లల పెండ్లిలకు,చదువులకు,అనారోగ్య కారణాలవల్ల చేసిన అప్పులు తీరక మానసిక వేదన చెందుతూ కాలం వెళ్లబుచ్చుచున్నాము.కాబట్టి మాకు రావలసిన అన్ని రకాల బకాయిలు మేము జీవించి ఉండగానే చెల్లించాలని, పెన్షన్ లోని ఇబ్బందులను తొలగించాలని మీ ద్వారా పై అధికారులను,ఎండి ని కోరుచున్నాము. తేదీ 20.1.2026 లోగా చెల్లిస్తారని భావిస్తున్నాం. లేని పక్షంలో 21 జనవరి 2026 రోజున బకాయిల సాధన కోసం బస్సు భవన్ వద్ద బైటాయింపు కార్యక్రమం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారధ్య కమిటీ ఆధ్వర్యంలో శాంతియుతంగా రాష్ట్ర ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులందరం కలిసి నిర్వహించ తలపెట్టాం. కావున యాజమాన్యం ప్రభుత్వం దృష్టి సారించి మా యొక్క సమస్యల పరిష్కారానికి సహకరిస్తారని ఈ తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు కోరుకుంటున్నారు.ఈ ప్రెస్ మీట్ లో వరంగల్ రీజియన్ విశ్రాంత ఉద్యోగులు పట్టాభి లక్ష్మయ్య,పాసికంటి మనోహర్,అశోక్ రావు,వెంకటయ్య, ఎం.ఎస్.రావు,సదానందం,గూడెల్లి బిక్షపతి,విశ్వనాథం,సోమయ్య,పెద్ది రవీందర్,శివాజీ కోటగిరి,వీరన్న,యాదగిరి స్వామి,ఎల్లయ్య,హయగ్రీవ చారి,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలకు ప్రోత్సాహకారంగా వివేకానంద బాలికల ప్రతిభకు వేదికగా ముగ్గుల పోటీలు







**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 13:** షాద్‌నగర్‌లోని వివేకానంద బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల సృజనాత్మకతకు వేదికగా ముగ్గుల పోటీలు ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు.పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమం పాఠశాల ఆవరణను రంగురంగుల ముగ్గులతో నింపేసింది.విద్యార్థినులు అసాధారణ ఉత్సాహంతో పాల్గొని, సాంప్రదాయ కళాత్మకతను ఆధునిక సృజనతో మేళవించి అద్భుతమైన ముగ్గుల డిజైన్లను సృష్టించారు. వారి కళాప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది.పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన చూపిన విజేతలకు ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకటించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ..విద్యార్థుల్లో సుప్తంగా ఉన్న కళాత్మక ప్రతిభను బయటపెట్టడమే మా లక్ష్యం. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పట్ల గాఢమైన అవగాహన, ఆదరణ పెంచడానికి ఇటువంటి సృజనాత్మక పోటీలు అత్యంత ప్రభావవంతంగా నిరూపితమవుతున్నాయి.ఈకార్యక్రమానికి హాజరైన స్థానికులు, తల్లిదండ్రులు బాలికల అద్భుత ప్రదర్శనను మనస్ఫూర్తిగా అభినందించారు. ముగ్గుల పోటీల ఏర్పాటుపై తీవ్ర సంతోషం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు, బాలికల్లో ఆత్మవిశ్వాసం, సృజనశక్తి, సాంస్కృతిక గౌరవభావనలు మరింత పెరిగేలా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని పాఠశాలను కోరారు.ఈ ముగ్గుల పోటీలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని సృష్టిస్తూ, విద్యార్థినుల మనసుల్లో ఆనందం, ఉత్సాహం, సాంస్కృతిక గర్వాన్ని నింపాయి.

# క్రీడల పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం







## గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

## కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్

**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 13:** కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్. మాట్లాడుతూ ఒక క్రీడాకారుడు ఉన్నతమైన స్థాయికి వెళ్లాలంటే అతనిలో ప్రతిభ ఉండాలి. ఒక కుటుంబం బాధ్యత ఎలా ఉంటుందో మ్యాచ్ లో విజయం సాధించడానికి అదే బాధ్యత ఉండాలని కొనియాడారు. పట్టుదల, సమయస్ఫూర్తి, జట్టులో కోఆర్డినేషన్ మరియు కమ్యూనికేషన్ ఉండాలని కొనియాడారు. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ మాట్లాడుతూ.....క్రీడల పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని యువత ఎలాంటి అవకాశం కావాలి అంటే నేను యువత కు ఎల్లప్పుడూ అండగా నిలుస్తాను అని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ మరియు బీమిడీ అశోక్ రెడ్డి ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను చూపి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే క్రీడల పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. నేటి తరం యువత చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడారంగంలో రాణించాలని, క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. పర్వదినం వేల గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారుల ప్రోత్సహించే విధంగా క్రీడల పోటీలలో నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బి రమేష్ మాట్లాడుతూ యువత క్రీడా లో పాల్గోనడం వల్ల శారీరకంగా మానసికంగా కూడా బలంగా ఉంటారు అని కొనియాడారు.డిప్యూటి సర్పంచ్ ముస్తాఫ మాట్లాడుతూ యువత ఎలాంటి అలవాట్లు అనగా మత్తుకు బానిస కాకుండా ఉండాలంటే క్రీడలు ఎంతో ముఖ్యం . గ్రామ వార్డు సభ్యులు మెరుగు నరసింహులు. ప్రభాకర్ కాజా మియా. మాజీ సర్పంచ్ యూసుఫ్.రవీందర్ యాదవ్ గారు. గోపాల్ గౌడ్. ఆశన్న గారి భుజంగారెడ్డి జగన్ గారు. ఎం చెన్నయ్య క్రీడాకారులు పాల్గొన్నారు.

# వాకిట నిలిచిన కళావైభవం .. ఘనంగా ముగ్గుల పోటీలు

**తొలి అక్షరం/మాడుగుల పల్లి/జనవరి 13:** మాడుగులపల్లి మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లెంల శ్రీకర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వించడం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో వంశీధర్ హాజరై గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ గువ్వ రవీందర్ రెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి దేవి రెడ్డి మల్లారెడ్డి, కట్ట ఎస్ అన్నారెడ్డి, చింతకుంట్ల సైదిరెడ్డి, రవి, మధు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఐనవోలు మల్లన్న జాతర: భక్తుల భద్రత కోసం 400 మంది పోలీసుల 'అభయహస్తం'

## - ఏసీపీ వెంకటేశ్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు

## అడుగడుగునా సీసీ కెమెరాల నిఘా, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు

## భక్తుల భద్రతా పరిరక్షణకు ఏసీపీ వెంకటేశ్ వ్యక్తిగతంగా పర్యవేక్షణ



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 12:** ఐనవోలు -- ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఐనవోలు మల్లన్న జాతర మహోత్సవాలను భక్తులు ఆతురతతో ఎదుర్కొన్న సందర్భంలో, భక్తుల రక్షణకు పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధమైంది. మామునూరు ఏసీపీ వెంకటేశ్ నేతృత్వంలో 400 మంది సుశిక్షితులైన పోలీస్ సిబ్బంది జాతర ప్రాంగణంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు రద్దీని సజావుగా నిర్వహించడానికి మరియు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవ డానికి, వందలాది సీసీ కెమెరాలను జాతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దిగించగా, భక్తులు సౌకర్యంగా, భద్రతలో దర్శనం పూర్తి చేసుకోవచ్చు.భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన ఏసీపీ వెంకటేశ్ మాట్లాడుతూ, "మల్లన్న దర్శనానికి వచ్చే ప్రతి భక్తికి ఎటువంటి అసౌకర్యం రాకుండా అన్ని చర్యలు చేపట్టాం. ప్రతి ఒక్కరూ పోలీసుల సహకారంతో క్రమశిక్షణ పాటిస్తూ, జాతర వైభవాన్ని ఆస్వాదించాలి" అని ఆకాంక్షించారు.

# మానుకోట కాంగ్రెస్‌కు కంచుకోట

**జిల్లాలో ఐదుకు ఐదు పురపాలక సంఘాల పై కాంగ్రెస్ జెండా ఎగరడం తథ్యం**

**మానుకోటలో 36కు 36 వార్డులు అస్తగతం**

**కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి**

**రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 13:** మానుకోట జిల్లా కాంగ్రెస్ పార్టీ కి కంచుకోట లాంటిదని జిల్లాలో 5 పురపాలక సంఘాలకు 5 అస్తగతం కానున్నాయని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు పొరిక బలరాం నాయక్ లు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ ఫంక్షన్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళి నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రులు సమన్వయంతో పని చేస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేస్తూ పరిపాలన రాష్ట్ర ప్రజల మనసుల్లో సుస్థిరంగా నిలిచిపోయే విధంగా సాగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గత పది సంవత్సరాలు ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందక అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ఉన్న రేషన్ కార్డులో పేర్ల నమోదు కానీ, మార్పులు చేర్పులు చేసుకునే సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డ విషయం తెలిసిందిరని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్త రేషన్ కార్డులు అరులైన ప్రతి ఒక్కరికి ఇస్తున్నామని, కార్డుల్లో పేర్లు మార్పులు చేర్పులు చేసుకునే సౌకర్యాలు కల్పించామని తెలిపారు. పౌర సరఫరాల దుకాణాల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. పేదవారికి 200 యూనిట్ వరకు ఉచిత కరెంటు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇవే కాకుండా అనేకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ప్రజల మనులు పొందుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో రెండింటికి రెండు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుందని, గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రంలో 70% పైగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ , ఉప సర్పంచ్లను స్థానాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. త్వరలో జరుగన్న పురపాలక సంఘ ఎన్నికల్లో అంతకంటే అధిక స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయ సాధిస్తుందని జ్యూస్ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు ఈ విధంగా ఆదరిస్తుంటే బి ఆర్ ఎస్ నాయకులు



జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. చింత చచ్చిన పులుపు చావదనే చందనముగా బిఆర్ఎస్ నాయకుల వ్యవహారం ఉందన్నారు. రాష్ట్రాన్ని అగ్ని గుండముగా మార్తామంటూ ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రకటన చేయడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గమనిస్తున్నారని తెలిపారు. త్వరలో జరగబోవున్న పురపాలక సంఘ ఎన్నికల్లో జిల్లాలో 5 పురపాలక సంఘాలకు ఐదింటిని కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసే విజయం సాధించాలని కోరారు. పార్టీ శ్రేణులకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి సహకారం, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ వార్డ్ కౌన్సిలర్లు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ బాక్స్ క్రికెట్ విజేత 'సన్నీ స్టార్' టీమ్



- ఉత్సాహంగా సాగిన సంక్రాంతి పోటీలు
- విజేతకు రూ.4 వేల నగదు బహుమతి ప్రధానం

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),జనవరి13:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని కాంటాయపాలెం రహదారిలో గల ఎంఎస్ బాక్స్ క్రికెట్ మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి.మంగళవారం జరిగిన తుది పోరులో 'సన్నీ స్టార్ 7 మెంబర్స్' జట్టు ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. **హోరాహోరీగా సాగిన ఫైనల్:** నిర్ణీత ఓవర్ల ఫార్మాట్‌లో సాగిన ఈ బాక్స్ క్రికెట్ ఫైనల్‌లో సన్నీ స్టార్ జట్టు సభ్యులు పస్తం మహేష్ బాబు,సన్నీ అరుణ్,గౌతం,ప్రణీత్,సిద్ధూ,బన్నీ, రాహుల్ సమిష్టిగా రాణించి అద్భుత ప్రతిభ కనబరిచారు. బ్యాటింగ్,బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా రాణించి ప్రత్యర్థి జట్టుపై పైచేయి సాధించారు.

**బహుమతుల ప్రధానం:**

పోటీల అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు విజేత జట్టుకు రూ.4 వేల నగదు పారితోషికంతో పాటు విజేత ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పండుగ సెలవుల్లో క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు, యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఈ టోర్నీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత సాయి, నరేష్, రాజుతో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.




# విగ్రహ రూపంలో ఉన్న స్వామిని పరిణమాడిన గోదాదేవి



## • నేడు శ్రీరంగంలో అత్యంత వైభవంగా గోదా కళ్యాణం

**శ్రీరంగం,జనవరి13:** తిరుప్పావై, గోదాదేవి కళ్యాణానికి తమిళనాడులోని శ్రీరంగం విశేష ప్రాధన్యం ఉంది. మిగతా కళ్యాణాలతో పోలిస్తే గోదా రంగనాథుల కళ్యాణానికి ఒక విశేషం ఉంది. అన్ని కళ్యాణోత్సవాలతో స్వామికి వైభవం ఉంటే గోదా రంగనాథుల కళ్యాణంలో మాత్రం వైభవం అంతా అమ్మ గోదా దేవికే ఉంటుంది. విష్ణుచిత్తుని కూతరుగా పెరిగిన అమ్మవారు శ్రీరంగనాధుడిని వలచి వరించి స్వామిలో ఐక్యం చెందిన ఇతిహాస పురాణం ఉంది. మిగిలిన దేవతా కళ్యాణోత్సవాలతో పోలిస్తే గోదా రంగనాథుల గోదా కళ్యాణం ప్రత్యేకతకు రెండు కారణాలు ఉన్నాయి. గోదాదేవి అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, ఆ ఆచరించిన దాన్ని మన దాకా ఆచరించేట్టుగా చేసింది అందుకే 'పాడియరుళవల్ల పల్–వళై యాయ్' అని అంటుంటాం. తాను ఆచరించిన దాన్ని ఎంతో కాలం దాక ఆచరించగలిగేట్టుగా ప్రబంధాన్ని అందించింది. అది గోదా దేవి గొప్పతనం. ఇది వరకు ఇలాంటి వ్రతాన్ని గోపికలు చేసారు కానీ వారు తరువాతి వారికి ఏమి అందించలేదు శ్రీకృష్ణుని అనుభవాన్ని పొంది ఊరుకున్నారు. గోదాదేవి నిత్యం ఆచరించి తెలియచేసిన కీర్తనలే తిరుప్పావై పాశురాలుగా ప్రసిద్ధి చెందాయి. సీతమ్మ రామచంద్రుణ్ణి వివాహమాడి ఊరుకుంది, పద్మావతి అమ్మవారు శ్రీనివాసున్ని వివాహమాడి ఊరుకుంది, కానీ గోదాదేవి ఒక్కో పాటలో మనం ఏం తెలుసుకోవాలి, ఎలా తెలుసుకోవాలి, ఎలా ఆచరించాలో చెప్పింది. సీతమ్మ కానీ పద్మావతి అమ్మవారు కానీ భగవంతుణ్ణి తనవంటి కదిలే రూపంలోనే వివాహ మాడారు. కానీ గోదా దేవి మానవకన్యగా ఉంటూ విగ్రహ స్వరూపుడైన రంగనాథున్ని వివాహమాడింది. ఆ వైభవమే తిరుప్పావైగా నెలరోజులు సాగిన తరవాత భోగి రోజు గోదాకళ్యాణంతో ముగిస్తారు. తన ఆచరణతో విగ్రహ స్వరూపుడైన భగవంతుణ్ణి కదిలేట్టు చేసుకుంది. ఇదే అమ్మవారి యొక్క గొప్పతనం. మన ఎదురుగుండా కనిపించే విగ్రహాన్ని, అది దైవమని విశ్వసించి, మనం చెప్పినట్లుగా మనం పిలిచినట్లుగా అది కదలగలుగుతుంది, పలకగలుగుతుంది అనే విశ్వాసాన్ని ఆండాళ్ తల్లి నిరూపించి చూపించింది. 'ఉలగనిల్ తోత్రమాయ్ నింద్ర శుడరే తుయిలెరాయ్', అంది అమ్మ అంటే లోకంలో కంటికి కనిపించేట్టుగా విగ్రహరూపంలో ఉండే భగవంతుడా! ఆ విగ్రహ రూపంలో నీ ప్రభావము అనుపమానము, అసమానము అని విశ్వసిస్తున్నాను అని చెప్పి భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. మూడు పనులు చేసి విగ్రహరూపంలో ఉండే భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. అవి కృష్ణమ్ ఉద్భోధ్య, కృష్ణమ్ అధ్యాపయంతి మరియూ 'కృష్ణమ్ బలాత్కృత్య భూంక్తే'. ఆయన ఏమి ఉలకకుండా పడుకుంటే మేల్కొల్పింది. చిన్న పిల్లవాడికి బెత్తం చూపి పాఠం చెప్పినట్లుగా, మనల్ని బాగుచేయడానికి, మనం తెలుసుకోవలసిన విషయాలని మనకి ఆయన ఎట్లా తెలిసేట్టు చేయాలో ఆయనకి పాఠాలు నేర్పింది. అంతే కాదు స్వామి విగ్రహరూపంలో ఉన్నా ఆయన్ని నిర్బందించి, బంధించి, ఆయన్ని పొందింది.

అందుకే ఎక్కడో శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ ఉంటే, శ్రీరంగంలో ఉన్న స్వామి స్పందించి అర్చకులని, రాజుని అమ్మని తీసుకురమ్మని ప్రేరేపించి రప్పించుకున్నాడు. విగ్రహంలో ఉన్న స్వామితో వివాహమని తెలియగానే జనాలు తండోపతండాలుగా తరలి వచ్చి ఆశ్చర్యపోయినందుకే ఆ వీదికి చిత్ర వీది అనే పేరు ఏర్పడిపోయింది. తరువాత వీది ఉత్తరవీది, అక్కడ ఉన్న స్వామి అమ్మని వివాగమాడి గోదాదేవిని తనలో చేర్చుకున్నాడు. మానవకన్యగా ఉన్న ఆండాళ్ తల్లిని ఉత్సవ మూర్తిగా మలచి తానూ ఉత్సవ మూర్తిగా శ్రీవిల్లిపుత్తూరులో కలిసి ఉన్నాడు. శ్రీరంగనాథున్ని వివాహమాడటంతో సీతారాములకే ఇలవేల్పు అయ్యింది. సీతారాములకి తరువాతి కాలంలో అవతరించినా వారికి ఇలవేల్పు అవడం అమ్మ గొప్పతనం. ఈ సందర్భంగా శ్రీరంగంలో గోదా కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.